

- వాడొద్దంటూ విద్యాశాఖ ఆదేశాలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- అతిక్రమించిన వారిపై చర్యలు
- జిల్లాలో 844 ప్రభుత్వ పాఠశాలలు

బడిలో సెల్‌ఫోన్‌కు ఇక చెల్లుచీటి

జగిత్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో సెల్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు విధించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చేవిద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశా లిచ్చింది. జిల్లా అధికారులు స్కూళ్లను తనిఖీ చేసి, సెల్‌ఫోన్ వాడే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేసింది. దీంతో విద్యాశాఖ వర్గాల్లో పాఠశాలల్లో సెల్‌ఫోన్ వాడకంపై విస్తృతంగా చర్చలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పరిధిలో 844 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 518, ప్రాథమికోన్నత పాఠశా లలు 90, ఉన్నత పాఠశాలలు 236 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 66 వేల మంది విద్యార్థులు చదువుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 4వేల పైచిలుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. చాలామంది ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తూ తమక ంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అయితే కొద్దిమంది స్కూల్‌కు వచ్చినా నిరంతరం ఫోన్‌లో మునిగితేలుతున్నారని పలువురు విద్యా ర్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లిన పుడు కొందరు టీచర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతుండడం చూసి తల్లిదం డ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయుల మూలంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సడలుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు బడిలో సెల్‌ఫోన్ వాడకంపై ఆంక్షలు విధించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలో తరగతి గదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకూడదని, ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు తాజాగా జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చారు.

● ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు..

బడిలో సెల్‌ఫోన్ వాడొద్దన్న విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై ఉపాధ్యాయులు భిన్నంగా స్పందిస్తున్నారు. సెల్‌ఫోన్ వాడకుండా ఉండ డమే మంచిదని కొందరు అంటుండగా.. మరికొందరు మాత్రం వ్యతిరే కిస్తున్నారు. కుటుంబ సభ్యుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో కాల్ వస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే స్కూల్‌లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల హాజరు విషయంలో ఫేస్ రికగ్నైజేషన్‌కు సెల్ ఫోన్ వాడాల్సి ఉంటుందంటున్నారు. చాలా సమాచారం ఫోన్ల ద్వారానే పంపుతామని పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్ వాడద్దంటే ఈ పనులన్నీ ఎలా చేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫేస్ రికగ్నైజేషన్, ఆన్‌లైన్ వర్క్స్ కోసం ట్యాబ్‌లు గానీ, ఇతర పరికరాలు అందిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిషేధం సమంజసమే..



బోధించే సమయంలో ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్ మోగినట్లయితే తరగతి గదిలో ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. సెల్‌ఫోన్ నిషేధం సమంజసమే. ప్రతీ పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినట్లయితే డిజిటల్ బోధనకు సెల్‌ఫోన్ ద్వారా నెట్ వాడడం ఉండదు. తద్వారా గదిలోకి సెల్ తీసుకొని పోవడాన్ని అరికట్టవచ్చు.

-యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అవసరం మేరకు సెల్ వాడడం మంచిది..



పాఠశాలలో ఉపాధ్యాయులు అదే పనిగా సెల్‌ఫోన్ వాడడం వల్ల బోధనలో ఇబ్బంది కలగడం వాస్తవమే.. కానీ మొత్తానికి సెల్ నిషేధం అంటే కష్టమే. పాఠశాలకు సంబంధించిన పలు పనులు, నివేదికలను ఫోన్ ద్వారానే పంపవలసి ఉంటుంది. బాల గేయాలు, రైమ్స్, కథలు లాంటివి నేర్పాలన్న ప్రొజెక్టర్లు లేని పాఠశాలలు సెల్‌ఫోన్లు అవసరమే.

-అనిత, కవయిత్రి, ఉపాధ్యాయురాలు, జగిత్యాల

నిషేధంపై ఆదేశాలు జారీ చేశాం..



తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగంపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు తగిన మార్గదర్శకాలిచ్చాం. వచ్చే విద్యా సంవత్సరం అన్ని వర్గాల సమన్వయంతో ఈ ఆదేశాలను పటిష్ఠంగా అమలు చేస్తాం.

-రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

పార్టీ కోసం పనిచేసే వారికే గుర్తింపు

● ఏఐసీసీ పరిశీలకుడు కత్తి వెంకటస్వామి



మాట్లాడుతున్న ఏఐసిసి పరిశీలకుడు కత్తి వెంకటస్వామి

జగిత్యాల అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేసే వారికే గుర్తింపు లభిస్తుందని ఏఐసీసీ పరిశీలకుడు కత్తి వెంకటస్వామి అన్నారు. కార్యకర్తల ఆవేదన వినకపోతే పార్టీ ఆగమైపోతదని ఆయన అన్నారు. బుధవారం జగిత్యాలలో జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటస్వామి మాట్లాడుతూ ఏఐసీసీ నిర్ణయం మేరకు కార్యకర్తల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. బీసీల కోసం పోరాడిన నాయకుడు జీవన్‌రెడ్డి అని కొనియాడారు. జీవన్‌రెడ్డి విషయాన్ని సోనియాగాంధీ దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలు అందరికీ చేరవేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీని గెలిపించే బాధ్యత కార్యకర్తలపై ఉన్నదన్నారు. అనంతరం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమానికి పెద్ద పీట వేశారని అన్నారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి నర్సింగారావు, కృష్ణారావు, బండ శంకర్, గాజంగి నందయ్య, తాటిపర్తి విజయలక్ష్మి, కొత్త మోహన్ పాల్గొన్నారు.

కలెక్టర్ చెప్పినా ధాన్యం కొనడం లేదు

● నిర్వాహకులను నిలదీసిన రైతులు

మెట్‌పల్లి రూరల్, మే, 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చెప్పినా మెట్‌పల్లి రూరల్ మండలం కోండ్రికర్ల గ్రామంలో మెట్లచిట్టాపూర్ పీఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదని రైతులు బుధవారం నిర్వాహకులను నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు దాటినా తూకం వేయడం లేదన్నారు. ఇటీవల కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అయినా హమాలీ, గన్నీ సంచుల కొరత ఉందని కాలం వెల్లదీస్తున్నారని రైతులు ఆరోపించారు. సీరియల్ ప్రకారం కొనడం లేదంటూ డీసీవోకు సమస్యను ఫోన్ ద్వారా తెలపడంతో పీఎస్‌సీఎస్ సీఈవో తిరుపతి అక్కడికి వచ్చాడు. ధాన్యం సీరియల్ ప్రకారం తూకం వేయకుండా ఇష్టం వచ్చినట్లు వేస్తున్నావని సీఈవోను ప్రశ్నించారు. రైతుల నిలదీయడంపై సీఈవోను వివరణ కోరగా హమాలీలను తీసుకొస్తే ధాన్యం తూకం వేస్తానని తెలిపాడు.

నిరుపేద కుటుంబానికి చేయూత

భీమారం, మే 7 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలకేంద్రానికి చెందిన చిలువేరి జమున-శంకర్ అనే దంపతులకు పక్షవాతం రావడంతో విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేయాలని స్థానిక నాయకులను ఆదేశించారు. దీంతో గ్రామ నాయకులు బియ్యం, నూనె, పప్పు సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, సంజీవ్, చెక్కపెల్లి మహేష్, సుధీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలి

కోరుట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలో ఈనెల 12న నిర్వహించే బుద్ధ పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పేట బాస్కర్, దయ్యి రఘువీర్, ఎలిశెట్టి గంగారెడ్డి, షాహేద్ మహ్మద్ షేక్, అఫీస్, వుయ్యాల శోభన్, పోట్ల లక్ష్మణ్, శనిగారపు రాజేష్, గాలి నరేష్, మారంపల్లి నర్సయ్య, ముత్తయ్య, రాజయ్యలు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

బుగ్గారం, మే7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల రైతులకు పలు పంటలపై బుగ్గారం రైతు వేదికలో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అక్షిత తెలిపారు. అనంతరం రైతుల పేరు ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు చేస్తామన్నారు. రైతులు తప్పకుండా ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ తమ వెంట తీసుకొచ్చుకోవాలని కోరారు.

నియామకం

వెల్గటూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వెల్గటూర్ మండల అధ్యక్షుడిగా పాషిగామకు చెందిన గోపతి జనార్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి తనకు మండల బాధ్యతలు అప్పగించడంతో బీజేపీ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

‘ఆపరేషన్ సింధూర్’పై సంబరాలు


మెట్‌పల్లిలో సంబరాల్లో పాల్గొన్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

మెట్‌పల్లిటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రమూకలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడులు చేయడంపై మెట్‌పల్లి విశ్వహిందూ పరిషత్, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాఖండ కార్యదర్శి మర్రి భాస్కర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన వైమానిక దాడులను స్వాగతిస్తున్నామన్నారు. పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు చేసిన దాష్టికానికి గట్టిగా సమాధానం ఇచ్చి భారత సైన్యం తన సత్తాను చాటిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పోహార్ తుకారాం, నగర అధ్యక్షుడు అరిగేలా సత్యనారాయణ, నగర కార్యదర్శి వేములవాడ రాజశేఖర్, సహ కార్యదర్శి ముక్క నరేష్, భజరంగ్‌దళ్ ఉత్తేజ్, నగర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బిజెపి నాయకులు, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యక సభ్యులు ధోనికెల నవీన్ పాల్గొన్నారు

●మల్యాల: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని బీజేపీ నాయకులు కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఉగ్రవాదులపై పోరులో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు కొండగట్టు అంజన్న ఆశీస్సులు ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, బొట్ల ప్రసాద్, పొన్నం సాయికుమార్, మల్లేశం యాదవ్, సామ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించాలి

కొడిమ్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. బుధవారం మండలంలోని సూరంపేట, కోనాపూర్, మండల కేంద్రంలో గ్రామాల్లో సెర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పూడూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. తూకం వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. మ్యాచర్ వచ్చే వరకు ధాన్యాన్ని ఆరపోసి తూకం వేయించు కోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట డీసీఎస్‌వో జితెందర్‌రెడ్డి, తహసీల్దార్ మేష్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఇన్‌చార్జ్ ఏపీఎం పద్మ, కార్యదర్శి రాజేందర్ రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


రహదారిపై ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ ఏఎంసీ మార్కెట్ యార్డు వద్ద గల నిజామాబాద్ జాతీయ రహదారిపై రైతులకు మద్దతుగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ రోడ్డుపై భైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారని జగిత్యాల మాజీ జడ్పీచైర్‌పర్సన్ ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా జగిత్యాల నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో గల తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పైరవీలు చేసి కమీషన్లు ఇచ్చినవారి ధాన్యాన్ని ముందుగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై ధర్నాతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనాలు సుమారు కిలోమీటర్ మేర నిలిచి పోయాయి. మాజీ జడ్పీచైర్‌పర్సన్ వసంత జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

‘బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు’



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి):ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో 5 ఎస్‌అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ ఫైల్స్ క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగు పరచుకోవాలన్నారు. ప్రజలకు, యువతకు ప్రత్యే కంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన యాక్సిడెంట్ జోన్‌లుగా, బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్‌లు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమారం, మే 7 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఇల్లెందుల శ్వేతకు రూ.15 వేలు, కట్ట లింగన్నకు రూ.60 వేలు, చిట్యాల ప్రశాంత్‌కు రూ.20వేలు, రాజేందర్‌కు రూ.23 వేలు, పులి లావణ్యకు రూ.29 వేలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, మాజీ ఉప సర్పంచ్ ఎండీ మక్బూల్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

మెట్‌పల్లి రూరల్, మే, 7 (ఆంధ్రజ్యోతి):క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది భద్రత ప్రమాణాలు పాటించాలని ఎన్పీడీసీఎల్ డీఈ శాలియానాయక్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో విద్యుత్ సిబ్బంది, కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యుత్ సిబ్బందితో పాటు కార్మికులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మికులు హెల్మెట్, సేఫ్టీ బెల్ట్ ధరించి, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్ వేసుకొని పనికి ఉపక్రమించాలన్నారు. తోటి ఉద్యోగులతో సమన్వయంతో పని చేయాలని కోరారు. వివిధ పరికరాలను ఆవిష్కరించిన అల్లాడి ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈ గంగారాం, ఏడీఈ మనోహర్, ఏఈలు అమరేందర్, రవి, అజయ్, వినీత్, సతీష్, సంతోష్, ప్రదీప్, శివకుమార్ పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసి యువకుడి ఆత్మహత్య

● ప్రేమించిన యువతి మోసగించిందని మనోవేదన



దార ఐలేష్ (ఫైల్)

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి తనను కాదని మరొకరితో వివాహం చేసుకోవడంతో మన స్థాపానికి గురైన ఓ యువకుడు సెల్ఫీవీడియో తీసి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలం లక్ష్మణపల్లి గ్రామానికి చెందిన దార ఐలేష్(23) హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మి అనేయువతితో కొన్నాళ్లుగా ప్రేమాయణం సాగిస్తున్నాడు. వీరి ద్దరు కొంతకాలంపాటు సహజీవనం చేసినట్లు సమాచారం. ఇంటర్మీడి యట్ చదువుతున్న సమయంలో వీరిమధ్య ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. ఐలేష్ జమ్మికుంటలో ఐటిఐ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో అప్రెంటీస్‌షిప్ చేస్తున్నాడు. ఓ శుభకా ర్యానికి హాజరయ్యేందుకు మూడురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల వరలక్ష్మి తన బావను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఐలేష్‌కు దూరంగా ఉంటూవస్తోంది. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన ఐలేష్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఉదయం నుంచి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు వాట్సాప్ స్టేటస్‌పెట్టుకున్నాడు. జమ్మి కుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై కూర్చొని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఎనిమిదేళ్లు వరలక్ష్మితో కలిసిమెలిసి ఉన్నానని, సెల్‌ఫోన్ కొని చ్చానని పేర్కొన్నాడు. మేం ఇద్దరం కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు, రికార్డులు తనఫోన్‌లో ఉన్నాయని, తాను ఆత్మహత్య చేసుకున్న తర్వాత వాటన్నింటిని వరలక్ష్మికి చూపించాలని సెల్ఫీ వీడియోలో కోరాడు. తన మృతదేహాన్ని ఆమె ఇంటిఎదుట వేయాలని సెల్ఫీ వీడియోలో పేర్కొ న్నాడు. మన ఆస్తులు అమ్మి అయినా కేసు పెట్టి శిక్షించాలని తల్లిదం డ్రులను సెల్ఫీ వీడియోలో కోరాడు. అనంతరం ఇంటర్‌సిటీ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



రాజ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ కంక ణాల రాజ్‌కుమార్‌రెడ్డి(45) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భూమి కరీంనగర్-వరంగల్ బైపాస్ రోడ్డు కింద కోల్పోవడంతో మనో వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురయ్యాడు. బుధవారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామ స్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. కుమార్తె శివాని దహన సంస్కారాలు నిర్వహించింది. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

వివాహం కావడం లేదని.. యువకుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని మన స్థాపం చెందిన యువకుడు ఒగ్గు మహేశ్(24) ఉరి వేసుకుని బలవ న్మరణానికి ఒడిగట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మహేశ్ గొర్రెలను పెంచుతూ జీవించేవాడు. వివాహ సంబం ధాలు వచ్చిన నిశ్చయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈనెల 6న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి చేరుకోలేదు. దాంతో ఆందోళనకు లోనైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని ఓ పాడుబడిన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లి రాజవ్వ, సోదరుడు నగేశ్‌లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్‌నగర్‌కు చెందిన తాడూరి రామ్‌కుమార్(38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామ్‌కుమార్ జిరాక్స్ మిషన్ మెకానిక్‌గా పనిచేస్తూ భార్య వనిత, ముగ్గురు కుమారులను పోషిస్తున్నాడు. సరైన పనిలేక కుటుంబ పోషణకు అప్పులు చేసి తీవ్ర ఆర్థికఇబ్బందులకు గురయ్యాడు. కుటుంబ పోషణభారం, ముగ్గురుపిల్లలు జన్మించినప్పుడు వైద్య ఖర్చుల కోసం రూ.3లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వనిత, కుమారులు సుకజీత్(11), శ్రీవాత్సవ్(5), విహాన్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దహన సంస్కారాలు చేయలేని పరిస్థితి..

కుటుంబాన్ని పోషించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకోగా.. దహన సంస్కారాలు నిర్వహించడానికి భార్య చేతిలో చిల్లి గవ్వలేక దీనంగా మృతదేహం వద్ద రోదిస్తుండడం పలువురిని కలచివేసింది. మృతదేహం వద్ద ముగ్గురు చిన్నపిల్లలతో గుండెలు పగిలేలా రోదిస్తుండడం పలు వురిని కంటతడి పెట్టించింది. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతు న్నారు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం

● పండ్ల తోటలు... కూరగాయల సాగుకు రాయితీలు
● యంత్ర పరికరాలకు సబ్సిడీ



చొప్పదండి, మే 7 (ఆంధ్రజ్యోతి): వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. పండ్ల తోటలు, పూల సాగు, కూరగాయల సాగుకు సబ్సిడీలతో పాటు యంత్రాలు, యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్యానికి 2025-26 సంవత్సరానికి ఉద్యానవనశాఖ రాయితీలను అందిస్తోంది.

పండ్ల తోటల పెపంకం (హెక్టారుకు)...

మామిడి: 19,200 రూపాయలు, **నిమ్మ:** 19,200, **జామ:** 19,200, **అరటి:** 16,800, **అవకాడో:** 12,000, **బొప్పాయి:** 7,200, **డ్రాగన్ ఫ్రూట్:** 65,000, **ముదురు మామిడి తోటల పునరుద్ధరణ** 9,600, **ఆయిల్ ఫాం సాగుకు** 10,500 రూపాయల రాయితీ ఉంటుంది.

కూరగాయల సాగు (ఎకరానికి)...

టమాటో: 10,000, **వంగ:** 10,000, **క్యాబేజీ:** 10,000, **కాలిఫ్లవర్:** 10,000, **మిర్చినారుకు** 10 వేల రూపాయల సబ్సిడీ ఉంటుంది.

● ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు హెక్టా రుకు 20 వేల రూపాయల సబ్సిడీ.

● తీగజాతి కూరగాయల సాగు, శాశ్వత పందిర్ల నిర్మాణం కోసం ఎకరానికి లక్ష రూపాయల సబ్సిడీ అందజేస్తారు.

● పూల సాగును చేపట్టే రైతులకు ప్రతి ఎకరాకు 8 వేల రూపాయల రాయితీని నగదు రూపంలో అందజేస్తారు.

యంత్రాలు...

ఉద్యాన పంటల సాగు కోసం 20 హెచ్‌పి ట్రాక్టర్‌కు 2 లక్షల 45 వేల సబ్సిడీ
పవర్ టిల్లర్: లక్ష రూపాయల సబ్సిడీ
పవర్ వీడర్ : 75 వేల సబ్సిడీ
బ్రష్ కట్టర్స్ : 25 వేల సబ్సిడీ

సూక్ష్మ నీటి సేద్యం

బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం సబ్సిడీ అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు (5 ఎకరాల వరకు) 90 శాతం, 5 ఎకరాలపై రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేస్తుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

చింతల రోహిత్, ఉద్యానశాఖ అధికారి, చొప్పదండి



ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసు కోవాలి. ఉద్యాన పంటల సాగుతో అనేక లాభాలు ఉన్నా యి. మార్కెట్‌లో పూలు, కూరగాయలు, పండ్లకు చాలా డిమాండ్ ఉంది. రైతులు ఉద్యాన పంటల సాగు చేపట్టాలి. ఉద్యాన పంటలను తక్కువ నీటితో ఎక్కువ సాగు చేపట్టవచ్చు.

బాలుడి మృతికి కారణమైన తల్లి, ఆమె ప్రియుడు అరెస్టు

సిరిసిల్ల క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): కొడుకు మృతికి కారణమైన కన్నతల్లి, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన అరుష్(5) అనే బాలు డిపై కన్నతల్లి, ఆమె ప్రియుడు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనలో తల్లి మాధవి, కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికిచెందిన సామల కిషన్‌లను బుధవారం అరెస్ట్‌చేసి రిమాం డ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. తల్లి జైలుకు వెళ్లడంతో ఒంటరైన ఎనిమిదేళ్ల కూతు రిని బాలసంరక్షణ సమితి చేరదీసింది. బాలికను చూసుకునేందుకు నానమ్మ, తాత ముందుకు వచ్చినప్పటికీ చట్ట ప్రకారం పోలీసులు ఆమెను బాలసం రక్షణ సమితికి అప్పగించారు. దీంతో బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.

బెహరాన్‌లో మల్లాపూర్ యువకుడి మృతి



పోగుల నరేష్(ఫైల్)

మల్లాపూర్, మే, 7 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌కు చెందిన పోగుల నరేష్ (23)అనే యువకుడు బెహరాన్ దేశంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గ్రామస్థులు బుధవారం తెలిపారు. పోగుల సురేష్ జీవనోపాధి కోసం ఐదేళ్ల క్రితం బెహరాన్‌కు వెళ్లాడు. కొంతకాలం నుంచి నరేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.బెహరాన్‌లో పనులు చేస్తుండగా ఆకస్మత్తుగా ఒక్కసారిగా కుప్పకూలి కిందపడ్డాడు. స్థానికులు గమనించగా నరేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమా చారం అందించారు. నరేష్ మరణవార్త విన్న కుటుంబసభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

గొల్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన నార్ల త్రిష(21) అనే యువతి తల్లి మందలించిందని బుధ వారం తెల్లవారుజామున ఇంటిలో ఉరే సుకుని బలవన్మరణం చెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు నార్లత్రిష ముంబాయిలో ఇంటర్ పూర్తి చేసి వచ్చి ఇంటి వద్దే ఉంటోంది. ఇంటిలో పనులుచేయడం లేదని మంగ ళవారం తల్లి మందలించింది. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన త్రిష బుధ వారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మ పురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఏడుగు రిని సీసీఎస్ పోలీసులు బుధవారం అదు పులోకి తీసుకుని వారివద్ద నుంచి 11,100 రూపాయలు, 6మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను ధర్మపురి పోలీసులకు అప్పగించగా కేసునమోదు చేశారు. జిల్లాఎస్పీ ఆదేశాలతో నిఘా పటి ష్టం చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు సీసీ ఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ రమష్, అఫ్రోజ్, కమలాకర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, మే 7 (ఆంధ్రజ్యోతి): గంగా ధర మండలం కురిక్యాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. అక్రమ ఇసుకరవాణాలో సంబంధమున్న నలు గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆమె తెలిపారు.

అదనపుకోర్టు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో అదనపు జిల్లాకోర్టు ఏర్పాటుచేయాలని న్యాయవాదులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సాను కూలం గా స్పందించిన బండి సంజయ్‌కుమార్ ఈ విషయాన్ని హైకోర్టు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, బార్ అసోసియే షన్ జనరల్ సెక్రెటరీ రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వీర్నపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన వరిధాన్యం అకాలవర్షానికి తడిసి పోయింది. మండలకేంద్రంతోపాటు పలు గ్రామా ల్లో బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలు లతో కురిసిన వర్షానికి ధాన్యపురాశులు, తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. అన్నదాతలు తడిసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తరలింపు జాప్యం చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు మండిపడు తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



వీర్నపల్లిలో వర్షపునీటిని తొలగిస్తున్న రైతు

చందుర్తి: చందుర్తి మండలంలో ఈదురు గాలులకు విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. స్తంభాలు, వృక్షాలు నెలకొరిగాయి. మండలకేంద్రంతోపాటు మర్రిగడ్డ, ఎనగల్ గ్రామాల్లోని కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం తడిసిపోగా, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. లింగంపేట, సనుగుల రహదారిలో చెట్లువిరిగి విద్యుత్‌స్తంభాలపై పడడంతో కరెంటువైర్లు నేలవాలాయి. లింగంపేటలో విద్యుత్‌సర ఫరాకు అంతరాయం ఏర్పడగా వెంటనే మరమ్మతులు చేపట్టారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతోపాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, తిమ్మాపూర్, గుండారం, రాజన్నపేటఅల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాలవర్షానికి కొనుగోలుకేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వరద నీటికి ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లలో చేరిన వాననీటిని తొలగించేందుకు అన్నదాతలు అవస్థలు పడ్డారు. తూకం వేసినబస్తాలు తడిసిపోవడంతో మొలకెత్తుతాయని వాపో తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



చందుర్తిలో తడిసిన ధాన్యం బస్తాలు



చందుర్తిలో తెగిన విద్యుత్ వైర్లు

నిర్వాసితులకు పరిహారం నిర్ణయించలేదు

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లిం చే పరిహారం ధరపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం వేములవాడలో రోడ్లవెడల్పునకు సంబంధించి సర్వేని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించానని, ఈ సందర్భంగా పరిహారంపై మీడియాలో వచ్చిన ధర అధికారికంగా నిర్ణయించలే దన్నారు. రోడ్డు డిజైన్, నిర్మాణగడువు తదితరఅంశాలపై కూడా తుది ప్రకటన విడుదల చేయలేదని, పరిహారం ధరపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు.

అగ్నికి ఆహుతైన పంటలు

ముత్తారం మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపెల్లి శివారులోని మానేరువాగు పరివాహక ప్రాంతంలో అగ్ని ప్రమాదంలో ముగ్గురు రైతులకు తీవ్ర నష్టం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మానేరు వాగు పరివాహక ప్రాంతం లో రైతులు వేల్పుల రవికి చెందిన ఎకరం వరి కుప్ప, అలాగే చల్ల సదికి చెందిన మూడు ఎకరాల కోసి ఒక దగ్గర ఉన్న వరి కుప్ప పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నికి అహుతై కోసిన పంట మొత్తం కాలిపోవడంతో రైతుల ఆదుకోవాలని వేడుకొన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. ఇదేప్రాంతంలో ఉన్న రాపెల్లి సురేందర్‌కు చెందిన 10 ఎకరాల ఆయిల్ పామ్ తోటలోని 302చెట్లుపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను చల్లార్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగేయా లేక ఎవరైనా అంటించారా అనేది తేలాల్సి ఉంది.



కాలిపోతున్న పామాయిల్ తోట

ద్విచక్రవాహనాల నిందితుల అరెస్టు

● 12 వాహనాలు స్వాధీనం



పట్టుకున్న వాహనాలు, నిందితులతో డీసీపీ భాస్కర్

జన్నారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నిందితులను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేస్తున్నారు. డీసీపీ భాస్కర్ జన్నారం పోలీస్‌స్టేషన్‌లో వివరా లను వెల్లడించారు. నిర్మల్‌జిల్లా దస్తూరాబాద్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బత్తుల పరమేష్, రెంకల నరేష్, కొట్టె బానేష్, జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన లావుడ్య హరికృష్ణ, మురిమడుగు గ్రామానికి చెందిన సంపంగి రమేష్‌లు ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నారు. మార్చి 5న జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పోచారం గ్రామానికి చెందిన కంచర్ల నరేష్ జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ వద్ద తన ఫ్యాషన్ ప్రో వాహనాన్ని నిలిపి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 7న ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఫ్యాషన్ ప్రో వాహనంపై వస్తున్న బత్తుల పరమేష్, రెంకల నరేష్ పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు.

పోలీసుల విచారణలో బానేష్, హరికృష్ణ, రమేష్‌లతో కలిసి వాహనాలు దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నారు. వీరు మంచిర్యాల, జగిత్యాల, జన్నారం, తదితర ప్రాంతాల్లో 12ద్విచక్రవాహనాలను దొంగలించారు. ఇందులో బత్తుల పరమేష్, రెంకల నరేష్, లావుడ్య హరికృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో మరో నిందితుడు సంపంగి రమేష్ పాత కేసులో జైలులో ఉండగా కొట్టె బానేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలను కొనుగోలు చేసినా, అమ్మినా నిజ ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్‌ఐ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, దహెగాం, కాగజ్‌నగర్‌లోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నింది తులను బుధవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ రూరల్‌సీఐ శ్రీనివాస రావు వివరాలు వెల్లడించారు. గతనెల 2న రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఆంజనేయ స్వామి ఆలయంలో, దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు, కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామం లోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగిందని చెప్పారు. ఈజీగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశ్యం తో చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకు న్నారన్నారు. నిందితులు త్రిదండపాణి అనిల్‌కుమార్ (పెద్దపల్లి జిల్లా, హనుమం తునిపేట), బాణాలలక్ష్మణ్ (పెద్దపల్లి)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిం దితులపై పెద్దపల్లి, వేములవాడ, వెల్గ టూరు, సుల్తానాబాద్, పొత్కపల్లి, వీణ వంక, ధర్మారం, మల్యాల, రామగిరి పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోద య్యాయని తెలిపారు. మరో నిందితుడు పైడి అజయ్ (పెద్దపల్లి జిల్లా రాంపలి) పరారీలో ఉన్నాడన్నారు. కూలీపని చేసు కునే అనిల్‌కుమార్, మెకానిక్ అజయ్ కలిసి ఈనెల 2న భాగ్యనగర్ రైలులో కాగజ్‌నగర్ చేరుకున్నారని అన్నారు. రాత్రి దహెగాం వెళ్లి అక్కడి గుడి తాళాలు పగులగొట్టి చోరీచేశారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి ఆలయంలో చోరీ చేశారని అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో కూడా చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు.

మూడు చోరీ కేసుల్లో నిందితుల నుంచి రెండు వెండి కిరీటాలు, వెండి మకుటం, వెండి హారం, వెండి నామాలు, వెండి పాదుకలు, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐతెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్సై సందీ్ కుమార్, ఏఎస్సై సర్తాజ్ పాషా పాల్గొన్నారు.

నేడు ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం

సుభాష్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): అండాశయ క్యాన్సర్ మహిళలను ప్రభావితం చేసే ప్రాణాంతక క్యాన్సర్లలో ఒకటి. అండాశయ క్యాన్సర్ అనేది స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలోని చిన్న అవయవాలైన అండాశయాలలో ప్రారంభయ్యే ఒక రకమైన క్యాన్సర్.



లక్షణాలు : అండాశయ క్యాన్సర్ యొక్క లక్షణాలు కడుపులో వాపు లాంటి భావన ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఆకలి లేక పోవడం లేదా త్వరగా నిండినట్లు అనిపించడం. పొత్తికడుపులో నొప్పివస్తుంది. పేగు అలవాట్లలో మార్పులు జరుగుతాయి. విరేచనాలు, మలబద్ధకం, కడుపులో తరుచుగా గ్యాస్ అనుభూతి కొనసాగుతుంది. మూత్ర విసర్జన చేయాలనే కోరిక అనిపిస్తుంది, కానీ మూత్రవిసర్జనకు వెళితే రాకపోవడం ఉంటుంది. లైంగిక చర్యలో ఉన్నపుడు నివారించలేని నొప్పి అండాశయ క్యాన్సర్ హెచ్చరిక లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటారు. అయితే అండాశయ క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తించడం కష్టమని వైద్యులు చెపుతున్నారు. అయితే ఇలాంటి లక్షణాలన్నీ అండాయశ క్యాన్సర్‌కు దారితీస్తాయని చెప్పలేమని తెలుపుతున్నారు.



ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం ప్రాముఖ్యత

2013 నుంచి ప్రపంచ క్యాన్సర్ కూటమి ప్రపంచ వ్యాప్తంగా మే 8న అండాశయ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అండాశయ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగ నిర్ధారణను ప్రోత్సహించడం దీని లక్ష్యం

స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది

డాక్టర్ విష్ణుప్రియ, గైనకాలజిస్టు మెడికవర్ హాస్పిటల్, కరీంనగర్



స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది అండాశయ క్యాన్సర్. స్త్రీల గర్భాశయంలో రెండు వైపులా రెండు అండాశయాలు ఉంటాయి. అండాశయాల్లో కణాలు అదుపులేకుండా పెరిగిపోవడమే అండాశయ (ఒవేరియన్) క్యాన్సర్. మారుతున్న జీవనశైలి కారణంగా భారతదేశంలో అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జన్యుపరమైన అంశం కూడా దీనికి కారణమవుతుంది. సాధారణంగా 50 సంవత్సరాలు నిండిన వారిలోనే అండాశయ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది. దీనిని ముందుగా గుర్తించకపోతే క్యాన్సర్ కణాలు క్రమంగా చట్టుపక్కల కణజాలాల్లోకి వ్యాప్తి చెంది శరీరంలోని ఇతర ప్రాంతాలకు క్యాన్సర్ వ్యాప్తికి దారితీయ వచ్చు. కేవలం 20శాతం అండాశయ క్యాన్సర్‌లు మాత్రమే ప్రారంభదశలో కనిపిస్తాయి. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

కల్లోల కాపురం


- బంధాలను బలితీసుకుంటున్న 'ఇగో'
- చిన్న చిన్న మనస్పర్థలతో రాణా మెట్లెక్కుతున్న దంపతులు
- క్షణికావేశంలో బలవన్మరణాలు

● జిల్లాకు చెందిన డిగ్రీ వరకు చదివిన ఓ యువతికి పొరుగు జిల్లాకు చెందిన యువకుడితో ఇటీవల వివాహం జరిగింది. ప్రతి ఆదివారం తనను కరీంనగర్‌కు పంపించాలని, లేదంటే కాపురం చేసేది లేదంటూ ఆమె భీష్మించుకుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు చెలరేగాయి. చివరికి ఇద్దరు పోలీసులను ఆశ్రయించారు. విడాకులు తీసుకోవడానికి అయినా సిద్ధమే కాని తనను ప్రతీ ఆదివారం తల్లిగారిల్లు కరీంనగర్‌కు పంపాల్సిందేనని ఆమె తెగేసి చెప్పింది. మహిళా స్టేషన్ పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ చేసినా ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. చేసేదేమి లేక భార్య పెట్టిన కండీషన్‌కు భర్త అంగీకరించడంతో వారి సంసారం సజావుగా నడుస్తోంది.

● భర్త సెల్‌ఫోన్ లాక్ చేసుకుంటున్నాడని, ఎవరితోనో మాట్లాడుతున్నాడని అనుమానిస్తున్నది భార్య. బాత్‌రూంకు పోయిన సందర్భంలో తన ఫోన్ చెక్ చేస్తున్నదని భర్త అసహనం. ఒకరిపై ఒకరు గొడవపడి చివరకు పోలీసులను ఆశ్రయించారు. తాను స్నేహితులతో మాట్లాడుతుండడం తప్పా?అని భర్త ప్రశిస్తుంటే.. రహస్యం ఏమీలేనప్పుడు ఫోన్‌కు లాక్ ఎందుకు పెట్టుకున్నాడని భార్య ప్రశ్న. ఇద్దరికి మహిళా స్టేషన్‌లో పోలీసులు పదిమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

\- కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి





దంపతుల మధ్య 'ఇగో' కాపురాలను కూల్చుతున్నది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్న చిన్న మనస్పర్థలు, గిల్లికజ్జాలు, అనుమానాలు కలతలను సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు మొదలవుతున్నాయి. చిన్న చిన్న గొడవలకు సర్దుకు పోవాల్సిన దంపతులు మొండిపట్టు పడుతుండడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. చివరికి అవి విడాకులకు దారి తీస్తున్నాయి. విద్యావంతులైన దంపతుల్లోనే ఇటువంటి ఆలోచనలు రావడం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న చిన్న విభేదాలు, అనుమానాలు తారాస్థాయికి చేరి దంపతులు రాణా మెట్లెక్కుతుండడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలోనూ ఎవరికివారే తమ వాదనే సరైందని సమర్థించుకుంటున్నారు. ఈ సమయంలో సర్దిచెప్పాల్సిన కుటుంబ సభ్యులు సరైన సమయంలో స్పందించకపోవడంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోతోంది. మరి కొందరు పోలీసులు, పెద్దల వద్దకు వెళితే ఎక్కడ పరువు పోతుందోనని, ఎవరికి చెప్పుకోలేక లోలోన మదనపడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. అనుమానాలు, అపార్థాలు, వివాహేతర సంబంధాలు సజావుగా సాగాల్సిన కాపురాల్లో కలతలు రేకెత్తిస్తూ బలవన్మరణాలకు దారితీస్తున్నాయి.

● ఉద్యోగస్తులదీ అదే దారి

మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఉద్యోగం చేస్తున్న, డిగ్రీపైన చదువుకున్న దంపతులు, ప్రేమ వివా హం చేసుకున్న నవ దంపతులవే ఎక్కు వగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్న దంపతుల మధ్య ఇగోతో పోలీస్‌స్టేషన్ మెట్లెక్కుతున్నారు. ఇద్దరు ఉద్యోగం చేస్తుంటడంతో సంపాదనలో తామేమీ తక్కువ కాదంటూ తరచుగా గొడవ పడుతున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న వారు ఏడాదిలోపే ఆర్థిక ఇబ్బందులు, అనుమానాల కారణంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు..

సం.	ఫిర్యాదులు	కేసులు	రాజీపడినవి
2022	1,104	92	1,012
2023	954	86	868
2024	1,099	113	986
2025	400	39	250

(ఏప్రిల్ 15 వరకు)

● కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు దంపతుల్లో బేదాభిప్రాయాలు తలెత్తినా... చిన్న చిన్న గొడవలు వచ్చినా కుటుంబంలో పెద్దలు ఇరువురిని కూర్చుండబెట్టి మంచి చెడులు... వాటి పరిణామాలు విడమరచి చేప్పేవారు. మారిన కాలంతో ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోతున్నాయి. వివాహం అయిన వెనువెంటనే విడిగా కాపురం ఉండడం, ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల కాపురం పెట్టడంతో దంపతుల మధ్య గొడవలు తలెత్తినప్పుడు సర్దిచెప్పేవారు లేకుండా పోతున్నారు.



మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల వెల్లువ

పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏకైక మహిళా పోలీస్ స్టేషన్ కరీంనగర్‌లో ఉంది. ఈ పోలీస్ స్టేషన్‌కు భార్యభర్తల మధ్య తగువులు, వరకట్నం వేధింపులు, గృహహింస, ప్రేమ వివాహాలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో ఉన్న మూడు పోలీసు సబ్ డివిజన్లలోని 21 స్టేషన్ల సంబంధించిన మహిళల కేసులు ఈ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నారు. 2024లో 1,099 మంది దంపతులు గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో 113 కేసులు నమోదుకాగా మరో 986 ఫిర్యాదుల్లో దంపతులకు కౌన్సెలింగ్‌లు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2025 ఏప్రిల్ 20వ తేదీ వరకు 400 మంది భార్యభర్తలు గొడవలు పడి కరీంనగర్ మహిళా రాణాలో ఫిర్యాదులు చేసుకోగా 39 కేసులు నమోదయ్యాయి. 250 ఫిర్యాదులపై దంపతులకు కరీంనగర్ మహిళా రాణా సీఐ పి శ్రీలత, భూ మిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌తో సర్దుకుపోయారు.



ధర్మపురిలో నవరాత్రోత్సవాలు

- ఐదో రోజు పూర్ణాహుతి
- సహస్ర కలశాభిషేకం



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఐదవ రోజు బుధవారం శ్రీ నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదమం త్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రా భిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ అర్చ కులు, సిబ్బంది పాల్గొన్నారు. నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



ఖిలావనపర్తిలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయం

ధర్మారం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం జరగనుంది. మంగళవారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం 7.40 నిమిషాలకు స్వామి వారి కల్యాణం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరగనుంది. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కాంతరెడ్డి, చైర్మన్ సంతోష్ తెలిపారు. బుధవారం కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 జరిగే స్వామి వారి రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

రసాభాస

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

- ఏఐసీసీ పరిశీలకుడి ఎదుటే రచ్చ
- జువ్వాడి, సుజీత్‌రావు వర్గీయుల మధ్య వాగ్వాదం





జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు, పార్టీ శ్రేణులను సముదాయిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వ హించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా జరిగింది. ఈసమావే శానికి ఏఐసీసీ పరిశీలకుడు కత్తి వెంకట స్వామి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరు కాగా వారి ఎదుటే కోరుట్ల నియోజకవర్గానికి చెందిన రెండు వర్గాల నాయకులు రచ్చ చేశారు. వేదికపైకి మెట్‌పల్లి మార్కెట్ చైర్మన్ గోవర్దన్ రావడంతో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు వర్గీయులు ఒక్కసారిగా బీఆర్ఎస్ కోవర్ట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కల్వకుంట సుజీత్‌రావు వర్గీయులు, నర్సింగారావు వర్గీయులతో వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారిని కాదని వలసవాదులకు మార్కెట్ చైర్మన్ పదవులు ఎలా ఇస్తారంటూ నర్సింగారావు వర్గీయులు ఆరోపించారు. ఇండిపెం డెంట్‌గా పోటీ చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి బీజేపీతో కలిసింది నిజం కాదా అని జువ్వాడి నర్సింగారావును ఉద్దేశించి సుజీత్‌రావు వర్గీయులు విమర్శించారు. దీంతో పరిస్థితి చేజారుతోందని గ్రహించిన విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువర్గాల వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

యోగా మాస్టర్‌కు కలెక్టర్ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యోగా శిక్షకురాలు పుప్పాల మల్లిక ఉత్తమ యోగా మాస్టర్ అవార్డు దక్కించుకుంది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏడవ అఖిల భారత సమావేశాలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన మల్లిక ఈ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి ఆమెను అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభచాటి ఉత్తమ యోగా మాస్టర్ అవార్డును అందుకోవడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డి, యోగా కోచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లికకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

14 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్.) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు మే 14న ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా తలనీలాల టెండర్ నిర్వహణ

వేములవాడ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని తలనీలాలకు బుధవారం టెండర్‌లను ఆహ్వానించారు. టెండర్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడంతో దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టెండర్ నిర్వహిస్తే దానికి సంబంధించిన పూర్తి వివరాలు దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఉంటాయని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 6 ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని కేసులు నమోదు చేశామని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బద్దిపెల్లి గ్రామంలో 4 ఇసుక ట్రాక్టర్లు, చేగుర్తి గ్రామ శివారులో 2 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న యువకులు

సమాజసేవలో మల్యాల యువకుల ఆదర్శం

హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం

మల్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే సదుద్దేశ్యంతో మల్యాలకు చెందిన యువకులు మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి అనేక మంది అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ దాతల సహకారంతో బాధితులకు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్యాలకు చెందిన ఆర్మీ ఉద్యోగి కీసర గణేశ్ వ్యవస్థాపకుడిగా 2021లో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను స్థాపించి 50మందితో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌లో అన్ని వర్గాల యువకులు, ప్రజలను భాగస్వామ్యం చేశారు. ఈ సంస్థలో ఇప్పుడు 600 మంది సభ్యులు ఉండగా అందులో ఆర్మీ ఉద్యోగులు, పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అనేక మంది సామాజిక సేవకులు ఉన్నారు. ప్రతీ నెలా తలా కొంత పోగు చేసుకొని ఎవ రికైనా ఆపద వస్తే ఆదుకుంటున్నారు.

● అనేక సేవా కార్యక్రమాలు

ప్రమాదాల్లో గాయపడిన బాధితు లకు, వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలకు, నిరుపేద యువతీ యు వకుల వివాహాలకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు నిత్యావసర సరుకులు అంద జేస్తున్నారు. పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు ఇస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన సామగ్రిని ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 30 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు.



చికిత్స కోసం సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సేవే లక్ష్యంగా ముందుకు

కీసర గణేశ్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు



ఆపదలో ఉన్నావారిని ఆదుకోవాలనే లక్ష్యంతో మిత్రులతో కలిసి ఈ సంస్థను ఏర్పాటు చేశాం. బాధిత కుటుంబాలకు చేయూత అందిస్తున్నాం. యువకులు, ఉద్యోగులు, మానవతా దృక్పథం కలిగిన చాలా మంది సంస్థలో చేరి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం.

అభాగ్యులకు ఆపన్నహస్తం

: గుర్రం శ్రీధర్‌గౌడ్, సభ్యుడు



బాధిత కుటుంబాల పరిస్థితులను వాట్సప్ గ్రూప్‌లో పెట్టడంతో సభ్యుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సభ్యులు తమకు తోచిన మేరకు సాయం అందిస్తున్నారు. సమాజ సేవ చేయాల నుకునే వారంతా ఫౌండేషన్ కార్యక్రమాల్లో పాలు పంచుకోవచ్చు.

వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): వాసవి మాత జయంతి పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ చకిలం మారుతి, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, కొమురవెల్లి రామ్మూర్తి, రాష్ట్ర నాయకుల నగునూరి అశోక్, మాదూరి ప్రసాద్, అయితు రమేష్, రాజేంద్ర ప్రసాద్, పల్లా అనిల్, సిరిపురం రమేష్, రామిడి రవీందర్, పల్లా శ్రీనివాస్, బాదం వాణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక వైశ్య భవన్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. అన్నదానం క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, పూజా సామగ్రిని జైన రాజమౌళి, స్వీట్స్ బీరెల్లి రాజుకుమార్ సమకూర్చారు. మల్యాల శ్రీనివాస్, శ్రీనివాస్, గుంత సతీష్, కొల్లూరి కిషోర్, ఎలగందుల అశోక్, తాటిపల్లి వంశీ, రాంమోహన్, చెన్న భూమయ్య, రవీందర్, హనుమన్లు, పాల్గొన్నారు.



సుల్తానాబాద్ వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం


చల్‌గల్‌లో వర్షానికి కొనుగోలు కేంద్రంలోకి చేరిన వర్షం నీరు


కోరుట్లలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

జగిత్యాలరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్, మోరపల్లి, తాటిపల్లి, తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసింది. ప్రభుత్వం తడిడిచిన ధాన్యాన్నికొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

●**కోరుట్ల రూరల్:** పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలు తడిచి పోయాయి. నువ్వు పంట నేలవాలగా మామిడి కాయ రాలిపోయింది. గాలి వానతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

●**వెల్గటూర్:** మండలంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం పాక్షికంగా తడిచింది. ఈదురు గాలులకు మామిడి కాయలు నేల రాలడంతో మామిడి రైతులు ఆందోళన చెందారు. ఇప్పటి వరకు 84,548 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించగా ఇంకా సుమారు 1,50,000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. కాగా తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

●**మల్యాల:** మండలంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షంకు కొనుగోలు కేంద్రాలలోని వరిధాన్యం తడిచింది. బుధవారం రోజంతా ధాన్యంను రైతులు ఆరబెట్టుకున్నారు. తూకం వేసిన సంచులు తడవడంతో వాటిని తలకిందులుగా పెట్టి ఆరబెట్టారు.

●**బీర్‌పూర్:** ఇటీవల కురిసిన వర్షానికి తుంగూర్ గ్రామంలో గల జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల స్టేజిపై ఏర్పాటు చేసిన రేకులు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన మరుగు దొడ్లపై అమర్చిన రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి గోడలు కూడా దెబ్బతిన్నాయి. బుధవారం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులకు ఊహించలేని విధంగా పాఠశాల పరిసరాలు కనిపించాయి. అధికారులు పునఃనిర్మాణానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

కోరుట్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : అధిక రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూమిలో సారం దెబ్బతిని పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు గోన్యానాయక్, వై స్వాతి సూచించారు. మండలంలోని నాగులపేటలో రైతులకు పంటల యాజమాన్యం ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే రసాయనిక ఎరువులను వినియోగించుకోవాలన్నారు. పంటల మార్పిడి చేసుకుని సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. పురుగు, కలుపు మందుల కొనుగోలు సందర్భంగా రైతులు తీసుకునే రసీదులు భద్రపరుచుకోవాలని కోరారు. విత్తనాల కొనుగోళ్ళకు సంబంధించిన రసీదులు ఉంటే నష్టపరిహారం పొందడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఓ దండ రమేశ్, ఏఓ లావణ్య, హార్టికల్చర్ ఏఈఓ రజిత, ఏఈఓ నరేశ్, సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి నర్సిరెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు, రైతులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అవగాహన సదస్సు

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో గల ధర్మపురి, నేరెళ్ల, వెలగటూర్, రాజారాం పల్లిలో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు భద్రత పట్ల అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల డివిజన్ ఇంజనీరు (ఆపరేషన్) రాజరెడ్డి, ఏడీఈ సింధూర్‌శర్మ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు భద్రత విషయంలో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు గురించి సూచించారు. వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలు బారిన పడకుండా ఉండడం కోసం వారికి తగిని ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన నిరంతరమైన సరఫరా ఇవ్వాలని, ప్రమాద రహిత జిల్లాగా జగిత్యాలను తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ట్రాన్స్‌కో ఏఈలు రవి, రాజశేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మల్లాపూర్, మే, 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో గ్రామంలో ఫైలేరియా రక్తపూతల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఇందిరా, శ్రీనివాస్, ఏఎన్ఎం కవిత, ఆశావర్కర్లు లత, సుశీల, అంగన్ వాడీ టీచర్లు సంధ్య, శోభపాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ నెల 7 నుంచి 13 దాకా బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండగా మొదటి రోజు కల్యాణం పండితులు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు స్వామి వారి కల్యాణం కనులారా వీక్షించారు. సాయంత్రం పురవీధుల వెంట పల్లకి సేవ జరిపారు. 11న నరసింహస్వామి జయంతి సందర్భంగా పంచామృతాలతో అభిషేకం, 12న ఉపవాసాలు, జాతర, 13న స్వామివారి రథోత్సవం, పుష్పయాగం నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం

రాయికల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లె గ్రామంలో రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బుధవారం క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలల్లో చేరాలంటూ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో కనీస వసతులు, అధ్యాపకుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపు తిరుమల్, అరవింద్, రాకేష్, మారుతి, గణేష్, అధ్యాపకులు చౌడారపు శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొడిమ్యాల, మే 7(ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు తప్పకుండ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో పి.జ్యోతి కోరారు. బుధవారం మండంలోని పూడూర్, నల్లగొండ, మండల కేంద్రంలోని రైతు వేదికలలో ఏఈవోలు చేస్తున్నఫ్యార్ రిజిస్ట్రీని ఏవో పరిశీలించారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం


తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తడిచిన ధాన్యం, రంగు మారిన ధాన్యంను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మండలంలోని ముత్యంపేట ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే తడిచిన ధాన్యం పరిశీలించారు. తడిచిన ధాన్యం గురించి కలెక్టర్‌తో మాట్లాడారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఈ సందర్భంగా రైతులతో అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం త్వరితగతిన తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ తదితరులు ఉన్నారు.

ఉగ్ర దాడికి ప్రతీకార చర్య సరైనదే

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

జగిత్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై చేస్తున్న ప్రతీకార దాడులు సరైనవేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట విద్యాసాగర్‌రావు అన్నారు. జగిత్యాల బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతీకారంగా సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరుకు భరత దేశానికి సమకరిస్తున్న వివిధ దేశాలకు ప్రతీ ఒక్కరికి అయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి స్వామి వారిని పంచామృతాలతో అభి షేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ శృంగేరి విరూపాక్ష మఠం అనంతపూరం శ్రీజగద్గురు శంకర దత్తాత్రేయ మహాసంస్థానకుడు విద్యానృసింభ భారతి మహాస్వామి సమక్షంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీచక్రపాణి వామనాచార్యులు వేదమంత్రోత్సవాల మధ్య ఉదయం నిత్యహోమం, బలిహరణము, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను చేపట్టారు. వేదపండితుల మంత్రోత్స వాలతో మంగళవాయిద్యల మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. కార్యక్రమంలో నాయకులు ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలి

మల్యాల, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడద నానాటికి పెరిగి పంటలను నష్టపరచడమే కాకుండా పంటల మార్పిడికి అవకాశం లేకుండా పోతుందని శాస్త్రవేత్తలు కోతుల బెడద నివారణకు తగు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రైతులు కోరారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. రైతుల అభిప్రాయాలు స్వీకరించిన శాస్త్రవేత్తలు పంటల సాగు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోలార్ ఫెన్సింగ్, జింక్ సబ్సిడిపై అందించాలని, నాణ్యమైన వరి వంగడాలను సరఫరా చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరారు. అనంతరం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు.

వైభవంగా వాసవీమాత జయంతి


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): వాసవి మాత జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలో వాసవి మాత ఆలయంలో బాధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఉత్సవ మూర్తికి పల్లకి సేవ, పృఆమృత అభిషేకము, వసంత రుతువులో లభ్యమయ్యే అమ్రఫల రసాభిషేకము, నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అయిదు వందల మందికి పైగా భక్తులు సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. సామూహిక కుంకుమార్చనలలో పాల్గొన్న మహిళలకు లక్కీ డ్రా నిర్వహించి డ్రాలో ఎంపికయిన మహిళలకు భహుమతులను అందజేశారు.

●ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య వాసవీ నిత్యాన్న సత్ర సంఘం ఆవరణలో గల వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు ఒజ్జల విలాస్ వేద మంత్రాల మధ్య అమ్మవారలకు పుష్ప, ఫల, పాల అభిషేకాలు, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూరగాయల సంతోష్‌కుమార్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్రం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, మాజీ ధర్మకర్త గునిశెట్టి రవీందర్, సాయిని సత్యనారాయణ, ఆర్యవైశ్య జిల్లా మహిళా సంఘం నాయకురాళ్లు జక్కు పద్మ, పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవిమాత జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మెట్ పల్లి పట్టణంలోని వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు,పండ్లు, ఓఆర్ఎస్ జ్యూస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు చాడ సురేష్, వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు కొండూరి రాజేష్ ,మాజీ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్ ,కొత్త నవీన్ ,ముక్క నరేష్, జిల్లా నవీన్ పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలోని వాసవి మాత ఆలయంలో బుధవారం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంప ఆనందం, మహిళా అధ్యక్షురాలు జిల్లాల లావణ్య, సంఘ నాయకులు ఎనుగందుల వీరేశం పాల్గొన్నారు.

●మల్లాపూర్ : మండల కేంద్రంలోని వాసవిమాత జయంతి వేడుకలను మండల ఆర్యవైశ్యులు కుటుంబ సభ్యులతో బుధవారం ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

కథలాపూర్, మే7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేట, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం జిల్లా వ్యాధి నిరోధక అధికారి ఏ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గత కొద్ది రోజుల కింద షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిబూడిదైనందు వల్ల పరికరాలను ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల నుంచి తెప్పించారు. అయితే పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలను నిల్వ ఉంచలేదు. ప్రస్తుతం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తెప్పించి గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక అధికారులు డీఐఓ దృష్టికి తేగా వారం రోజుల్లో స్టాఫ్ నర్సును కేటాయిస్తామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ మరియు ఎన్‌సీడీ సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్ వైద్యాధికారులు అర్చన, సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్ ఉన్నారు.

హరితహోమ్స్ కాలనీ అధ్యక్షుడిగా హరికిరణ్

జగిత్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిత హోమ్స్ కాలనీ అధ్యక్షునిగా భైరం హరికిరణ్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో హరిత హోమ్స్ కాలనీ (పల్లి కాంపౌండ్) అసోసియేషన్ అధ్యకునిగా భైరం హరికిరణ్ రెండు సంవత్సరాల కాల పరిమితికి గాను ఎన్నికయినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి గాసమిండ్ల రాజేష్, ఫైనాన్స్ సెక్రటరీ రాజశేఖర్, ఉపాధ్యకుడిగా బీమనాతిని లక్ష్మణ్, సహా కార్యదర్శిగా దాత్రిక రాజు, గౌరవ అధ్యకునిగాగా నూనె శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి రాజమల్లయ్య తెలిపారు. గౌరవ సలహాదారులుగా రాజమల్లయ్య, రమేష్ నియమించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల, మే7(ఆంధ్రజ్యోతి) : ప్రజలు సైబర్ నేరాలు జరుగకుండా జాగ్రత్తగా ఉండాలని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ కోరారు. బుధవారం రాత్రి మండలంలోని చెప్యాల గ్రామంలో సైబర్ నేరాలు జరుగకుండా సామాజిక అంశాలపై జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో కొడిమ్యాల ఎస్సై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఎస్సై సందీప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాలు, మూడనమ్మకాలు, గల్ఫ్ ఏజెంట్ మోసాలపై అవగాహన కల్పించారు.

షీ టీం, సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కలిపించారు. ఎవ్వరైనా మోసపోతె 1930 నెంబరుకు కాల్ చేయాలని ఎస్సై కోరారు. గ్రామాలలో తిరుగుతున్న అనుమానస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళా బృందం, గ్రామ మాజీ సర్పంచు రాజేశం, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, మే, 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన మండల పశు వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామంలోని ఆవులు, గేదెలు, 3నెలల పైబడిన దూడలకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వైద్యులు వేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైరస్ వ్యాధులు సోకకుండా మూగజీవాలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు రమణయ్య, రమాదేవి, మురళి, ఖాజా ఆఫీస్, చిరంజన్, దిలీప్, మోహన్, పాడి రైతులు శేఖర్, సంజీవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులను వెనక్కి పంపాలి


కలెక్టరేట్ ఏఓ హకీంకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా ఆశ్రయం పొందుతున్న పాకిస్తాన్, బంగ్లాదేశీయులను వెంటనే వెనక్కి పంపాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓ హకీంకు బీజేపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ హకీంను కలిసి సమస్యను విన్నవించారు. ఈసందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, నాయకులు కొక్కు గంగాధర్, నలువాల తిరుపతి, గుంటుక సదాశివ, రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కోరుట్ల: కోరుట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో అక్రమంగా నివాసం ఉంటున్న పాకిస్తాన్, బంగ్లాదేష్ వారిని గుర్తించి వారి దేశాలకు పంపాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోరుట్ల బీజేపీ, బీజేవైఎం శాఖ అధ్వర్యంలో ఆర్‌డీఓ జీవకర్ రెడ్డికి వినతి పత్రంను అందజేసింది. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: మెటుపల్లి డివిజన్ వ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ రోహింగ్యా ముస్లిం వారిని గుర్తించి వారిని వెంటనే వారి స్వదేశాలకు పంపించాలని బీజేపీఎం పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆర్డిఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నరేందర్ రెడ్డి. బిజెపి జిల్లా నాయకులు చింతల శ్రీకర్ గౌడ్ పాల్గొన్నారు.

●పెగడపల్లి: భారత దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించి వెంటనే ఆ దేశాలకు పంపాలని కోరుతూ భారతీయ జనతాపార్టీ పెగడపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రవీందర్ కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, నాయకులు కొత్తూరు బాబు, షేరు అంజన్న, మల్లేష్, శ్రీనివాస్, హరీష్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: పాకిస్తాన్ ముస్లింలను తమ దేశానికి పంపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌కు మండలంలోని బీజేపీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

●ధర్మపురి: బీజేపీ ఆధ్వర్యంలో ధర్మపురి మున్సిపల్ కల్లెడ రాజశేఖర్, మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

●గొల్లపల్లి: పాకిస్థానీయులను, బంగ్లాదేశీయులను స్వదేశాలకు వెంటనే పంపించి వేయాలంటూ గొల్లపల్లి తహసీల్దార్ వరందన్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది శేఖర్, బీజేవైఎం మండల శాఖ అధ్యక్షుడు లక్కాకుల వెంకటేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు సంగెం కళ్యాణ్ పాల్గొన్నారు.

●రాయికల్: భారతదేశంలోకి అక్రమంగా చొరబడిన అక్రమ వలసదారులను వెంటనే బహిష్కరించాలని కోరుతూ రాయికల్ పట్టణ, మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు కుర్మ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్ పాల్గొన్నారు.

●మల్లాపూర్ : విదేశీయులను గుర్తించి వారిని స్వదేశాలకు పంపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

మెట్‌పల్లిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి ప్రశంస పత్రాలను అందజేశారు. పట్టణంలోని మిని స్టేడియంలో వరల్డ్ అథ్లెటిక్స్ డూ సందర్భంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను జిల్లాలోని 10 కేంద్రాలలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసి, వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ ఉపాధ్యక్షులు గజల్లి రాందాస్, కార్తిక్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, మే7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి పూడూర్ గ్రామానికి చెందిన తీగల మునవ్వరాజమల్లుగౌడ్ బుధవారం 25వేల 116రూపాయలను ఆలయ నిర్మాణ కమిటీ వారికి విరాళంగా అందించారు.

మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ధాన్యం

-హమాలీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం


పేరుకుపోయిన ధాన్యం

కోరుట్ల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌యార్డులో కొనుగోళ్ల ఆలస్యం కావడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. మార్కెట్ యార్డులో సింగిల్ విండో ఆధ్వర్యంలో గత 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాంను నాయకులు అట్టహాసంగా ప్రారంభించంగా కోరుట్ల పట్టణంలోని రైతులు వారు పండించిన పంటను యార్డులో కొనుగోలు చేయడానికి తరలించి నిలువ చేసుకున్నారు. పోసిన రోజు నుండి ఇప్పడి వరకు సరైన హమాలీ లేకపోవడంతో కొనుగోలులో జాప్యం చోటుచేసుకుంది. దీంతో మార్కెట్ యార్డు పూర్తిగా ధాన్యంతో నిండిపోయింది. దీనికి తోడు వాతవరణంలో వస్తున్న మార్పులతో వారం రోజులలో మూడు పర్యాయాలు వర్షం ఎండ వాన తేడా లేకుండా వాటి వద్దనే ఉండిపోతున్నారు. ఈ క్రమంలో గత మంగళవారం బారీగా వీసిన గాలి వానతో దాన్యం కుప్పలపై ఉన్న పాల్తిన్ కవర్ల్ లేచిపోయి దాన్యం పూర్తిగా తడిచిపోయి వరద నీటిలో కొట్టుకపోయింది. కొంత మేర తూకం వేసిన ధాన్యం బస్తాలు వర్షంకు పూర్తిగా తడిచి ముద్దయినాయి. కొంత మంది హమాలీలతో తూకం వేయిస్తున్న సింగిల్ విండో అధికారులు పైరవీలకు ఎక్కువ శ్రద్ధ చూపి వారు చెప్పిన వారికే తూకం వేస్తున్నట్లు అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇప్పడికైనా అధికారులు వాతావరణంలో వస్తున్న మార్పులను గమనించి హమాలీల సంఖ్య పెంచి దాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అన్నదాత కోరుకుంటుంది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

భీమారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఏఎంసీ డైరెక్టర్ సురకంటి రాజరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మండల వ్యాప్తంగా తడిచిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ ఆదేశాలతో ఒడ్యాడ్ గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సూర మహేష్, లక్ష్మణ్, గంగరాజం, ఆవ శంకర్, సాగర్, గంగ నర్సయ్య, ఋత్విక్ రెడ్డి, నిర్వాహకులు ప్రమోద్, మహేందర్, లహరి, గంగనర్సు మంతెన భారతి తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కొనుగోళ్లలో వేగం పెంచాలని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్, మోరపల్లి కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిచిన వరిధాన్యాన్ని మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్యపడొద్దని అన్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్, సంఘకార్యదర్శి గాజంగి వేణు, సిబ్బంది అజయ్, కేంద్ర నిర్వాహకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇబ్రహీంపట్నం, మే 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ ఎంపీపీ నెరెళ్ల దేవేందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాస్ పథకం, రైతులకు రుణమాఫీ, రైతు బరోసా పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.